ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition

శనివారం 10 మే 2025 www.prajaswaramdaily.com 4 pm


# పాక్‌వి పనికిమాలిన ఆరోపణలు

**ఆఫ్గాన్ ప్రజలకు మేం ప్రత్యేకంగా చెప్పాల్సిందేమీ లేదు**

**ఎవరు ఎవరిని లక్ష్యంగా చేసుకున్నారో అందరికీ తెలుసు**

**భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ**



న్యూఢిల్లీ: "పాకిస్థాన్ ఆరోపణలన్నీ పనికిమాలినవేనని భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ సూటిగా బదులిచ్చారు. తాజాగా భారత్ - అఫ్గానిస్థాన్ దేశాల మధ్య చిచ్చు పెట్టేలా పాక్ వ్యాఖ్యలు చేసింది. అఫ్గాన్ లక్ష్యంగా భారత్ మిస్సైల్స్‌ను ప్రయోగిస్తోందని పాక్ ఆర్మీ అధికారులు తప్పుడు ప్రకటనలు చేశారు. అయితే, దానికి ఆయన బదులిచ్చారు. "పాకిస్థాన్ ఆరోపణలన్నీ పనికిమాలినవే. ఈ సందర్భంగా నేను ఓ విషయం చెబుదామనుకుంటున్నా. అఫ్గాన్ ప్రజలకు మేం ప్రత్యేకంగా మా దేశం గురించి చెప్పనక్కర్లేదు. అలాగే గతేడాదిన్నర నుంచి పలు సందర్భాల్లో అక్కడి మౌలిక సదుపాయాలు, ప్రజలను ఎవరు లక్ష్యంగా చేసుకున్నారో గుర్తు చేయాల్సిన అవసరం లేదనుకుంటున్నా. ఇప్పుడు పాక్ ప్రభుత్వంపై అక్కడి ప్రజలే తీవ్ర స్థాయిలో విమర్శలు చేస్తున్నారు" అని వెల్లడించారు.

# ప్రధాని అధ్యక్షతన హైలెవల్ మీటింగ్

**తదుపరి కార్యాచరణ, వ్యూహంపై కీలక నిర్ణయం తీసుకునే చాన్స్**

**రాజ్‌నాథ్‌సింగ్, అజిత్‌దోవల్, సీడీఎస్ అనీల్, త్రివిధ దళాధిపతులు హాజరు**

**ఉదయం నుంచి జరుగుతున్న పరిణామాలపై వివరణ**

న్యూఢిల్లీ : ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నివాసంలో హైలెవల్ మీటింగ్ కొనసాగుతుంది. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌దోవల్, సీడీఎస్ అనీల్ చౌహన్ తో పాటు త్రివిధ దళాధిపతులు హాజరయ్యారు. ఆపరేషన్ సింధూర్, సరిహద్దు ప్రాంతాల్లో పరిస్థితులు, తదుపరి కార్యాచరణపై చర్చిస్తున్నారు. ఇవాళ ఉదయం నుంచి జరుగుతున్న తాజా పరిణామాలపై ప్రధానికి త్రివిధ దళాధిపతులు వివరిస్తున్నారు. తదుపరి కార్యాచరణ, వ్యూహంపై ప్రధాని మోడీ కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.



# ఐదుగురు కీలక టెర్రరిస్టులు హతం!

**అంత్యక్రియల్లో పాల్గొన్న పాక్ ఐజీ స్థాయి పోలీసు అధికారి**

న్యూఢిల్లీ : ఉగ్ర దాడికి ప్రతీకారంగా భారత్ జరిపిన దాడుల్లో మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులైన అబు జిందాల్, హాఫీజ్ ముహమ్మద్ జమీల్, యూసుఫ్ అజార్, అబు ఆకాషా, మహ్మద్ హసన్ ఖాన్ హతమయ్యారని భారత భద్రతా దళాలు ప్రకటించాయి. హాఫీజ్ ముహమ్మద్ జమీల్.. జైషే మహమ్మద్ ఛీఫ్ మౌలానా మసూద్ అజర్ కు పెద్ద బావమరిది. మే 7వ తేదీన పాకిస్తాన్‌లోని ఉగ్ర స్థావరాలపై భారత జరిపిన దాడుల్లో ఇప్పటి వరకు ఐదుగురు కీలక టెర్రరిస్టులు మరణించారు. చనిపోయిన వారిలో జైషే‌ఏ మహమ్మద్ చీఫ్ మసూద్ అజర్ కొడుకు హాఫీజ్ జమీల్.. మసూద్ బావమరిది యూసఫ్, లష్కరే తోయిబా చీఫ్ అబు జిందాల్ తో పాటు లష్కరే తొయిబా తీవ్రవాద సంస్థతో మరో ఇద్దరికి సంబంధం ఉంది. కాగా, ముదస్సర్ అంత్యక్రియలను ఓ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. అంతర్జాతీయ తీవ్రవాదిగా గుర్తించిన "హాఫీజ్ అబ్దుల్" ఆధ్వర్యంలో ఈ అంత్యక్రియలు జరిగాయి. పాక్ సైన్యాధికారి, ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) హోదాలో పని చేస్తున్న పాకిస్తాన్ లోని పంజాబ్ పోలీసు ఉన్నతాధికారి సైతం హాజరు అయ్యారు.

# శ్రీనగర్‌లో మళ్లీ పేలుళ్లు

**దాల్ సరస్సులో మిస్సైల్ శకలాలు**

**అధికారులు అప్రమత్తం**

**32 విమానాశ్రయాల మూసివేత..**

**కేంద్రం అత్యవసర నిర్ణయం**

న్యూఢిల్లీ : శ్రీనగర్‌లో మరోసారి భీకరమైన పేలుళ్లు సంభవించాయని ఆర్మీ అధికారులు తెలిపారు. శనివారం ఉదయం 11.45 గంటల ప్రాంతంలో శ్రీనగర్ విమానాశ్రయం సమీపంలో రెండు భారీ పేలుళ్ల శబ్దాలు వినిపించడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ పేలుళ్ల ధాటికి ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. పేలుళ్ల శబ్దం వినగానే అధికారులు వెంటనే పలు ప్రాంతాల్లో సైరన్లు మోగించి ప్రజలను అప్రమత్తం చేశారు. అంతేకాకుండా అవంతిపురం సమీపంలో కూడా ఐదుసార్లు భారీ పేలుడు శబ్దాలు వినిపించినట్లు అధికారులు పేర్కొన్నారు. మరింత ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, శ్రీనగర్‌లోని ప్రఖ్యాత దాల్ సరస్సులో క్షిపణి లాంటి ఒక వస్తువు పడినట్లు గుర్తించారు. శనివారం తెల్లవారు జామున కూడా శ్రీనగర్ విమానాశ్రయం, ఎయిర్ బేస్‌లపై పాకిస్తాన్ డ్రోన్లతో దాడికి ప్రయత్నించగా, భారత సైన్యం వాటిని సమర్థవంతంగా తిప్పికొట్టింది. పంజాబ్‌లోని బఠిండాలో అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. శ్రీనగర్ విమానాశ్రయం సమీపంలో తరచూ పేలుళ్లు సంభవిస్తుండటంతో, దానితో సహా ఉత్తర, పశ్చిమ భారత దేశంలోని మొత్తం 32 విమానాశ్రయాలను ఈనెల 15వ తేదీ వరకు మూసివేస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.



# పాకిస్తాన్ కు రూ.8500 కోట్లు

**బిలియన్ డాలర్ల నిధులు విడుదల చేసిన ఐఎంఎఫ్**

**ఈ డబ్బు ఎలా వినియోగిస్తుందన్న దానిపై భిన్నాభిప్రాయాలు**

**ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతుగా ఉపయోగించే అవకాశం?**

ఇస్లామాబాద్ : పాకిస్తాన్‌కు అంతర్జాతీయ ద్రవ్య నిధి (ఐఎంఎఫ్) నిధులు మంజూరు చేసింది. 1 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో సుమారు రూ. 8,500 కోట్లు) నిధులను విడుదల చేసింది. దీంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పాకిస్తాన్‌కు మరింత అవకాశం లభించింది. ఈ ఆర్థిక సహాయం భారత్‌కు మరింత ముప్పుగా పరిణమించే అవకాశం ఉందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఐఎంఎఫ్ ఈ నిధులను విడుదల చేయడానికి కొన్ని షరతులు విధించినప్పటికీ, ప్రస్తుతం నెలకొన్న క్లిష్ట పరిస్థితుల్లో ఇది పాకిస్తాన్‌కు అత్యంత అవసరం. ఈ నిధులతో పాకిస్తాన్ తన ఆర్థిక వ్యవస్థను కొంతవరకు స్థిరీకరించుకునే ప్రయత్నం చేయవచ్చు. ఈ డబ్బును పాకిస్తాన్ ఎలా వినియోగిస్తుందనే దానిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.
పాకిస్తాన్ ఈ నిధులను తన ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచడానికి, ప్రజల అవసరాలను తీర్చడానికి ఉపయోగిస్తుంది. మరికొందరు మాత్రం, పాకిస్తాన్ ఈ నిధుల్లో కొంత భాగాన్ని ఉగ్రవాద కార్యకలాపాలకు మద్దతుగా ఉపయోగించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐఎంఎఫ్ విడుదల చేసిన ఈ నిధులు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. ఇటీవల భారత్‌పై పాకిస్తాన్ క్షిపణులు, డ్రోన్లతో దాడులకు తెగబడుతున్న విషయం తెలిసిందే. టర్కీ కూడా దాడులకు సహకరిస్తోందనే వార్తలు వస్తున్నాయి.

